# అతిథి దేవుడు

**కా**లింగ్ బెల్ శబ్దం విని అప్పుడే మంచం మీద నడుం వాల్చబోతూన్న విశాల ఉలిక్కి పడింది. 'భగవంతుడా, చుట్టాలు రాకుండా దయచూడు' మనసులోనే దండం పెట్టుకుని అదిరే గుండెలను చిక్కపట్టుకుని తలుపుతీసింది. తలుపు తీయగానే ఆమెకు అర్థమైపోయింది దేముడు దయచూడలేదని!

సూట్‌కేసుతో గుమ్మంలో నిలబడ్డ శివరామయ్యని చూసి మొహంపైకి చిరునవ్వు తెచ్చుకుని ఆహ్వానించింది, "రండి" అంటూ. లోపలకు వచ్చి కూర్చున్నాక మంచినీళ్లు తెచ్చియిచ్చి "ఒక్కరే వచ్చారేమిటి?" "పిన్నిగారిని కూడా తీసుకురాలేదేం?" "ఏ ట్రైనుకు వచ్చారూ?" లాంటి కుశల ప్రశ్నలు వేస్తూనే మనసులో ఆలోచనలు మొదలు పెట్టింది. 'తమ భోజనాలు అయిపోయాయి. ఈయన భోజనం చేసి వచ్చారో, లేదో, కొంచెం పులుసు, పప్పు మిగిలాయంతే, ఏం వండాలో అనుకుంటూ విషయం తెలుస్తుందని "స్నానం చేయండి బాబాయ్‌గారూ, అరగంటలో వంట చేసేస్తాను" అంది.

"అలాగే చన్నీళ్లు అలవాటులేదు. కాసిన్ని వేడినీళ్ళు పడెయ్యమ్మా" అన్నాడాయన. స్టౌ వెలిగించి నీళ్ళు పడేసి కూరగాయలు బుట్ట తీసుకుని కూర్చుంది వంట చేయటానికి.

శివరామయ్య వాళ్లకి బంధువేమీ కాదు, అయిదారు నెలల క్రితం విశాల వాళ్ళు తిరుపతి వెళ్లినప్పుడు కొండమీద పరిచయమయ్యారు శివరామయ్య దంపతులు. ఇద్దరిదీ ప్రక్క ప్రక్క కాటేజీలు అవటంతో రెండు కుటుంబాలకీ పరిచయం పెరిగి అక్కడున్న మూడు రోజులూ అంతా కలిసి తిరిగారు. ఆ స్నేహంతో వెళ్ళిపోయేటప్పుడు తమ తమ ఊళ్లకి రమ్మనమని ఆహ్వానాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఆ ఆహ్వానాన్ని పురస్కరించుకునే శివరామయ్య ఇప్పుడు వచ్చాడు. ఆ ఊళ్ళో ఆయనకి వసూలు కావల్సిన బాకీ ఉంది. ఆ పనిమీద వచ్చానని చెప్పాడు.

విశాలకి బంధుప్రీతి ఎక్కువే. కానీ వరుసగా రెండు మూడు నెలల నుండీ బంధువుల తాకిడి ఎక్కువగా ఉంది. ఒంట్లోనూ అంతగా బావుండటంలేదు. నీరసంగా ఉంటోంది. వచ్చిన బంధువులందరికీ ఎప్పుడూ రానివాళ్లనో, ముఖ్యమైన స్నేహితులనో మర్యాదలు చేసి పంపటంతో అప్పు కూడా బాగా పెరిగింది. అందుకే ప్రస్తుతం విశాలకి బంధువులంటే భయం పట్టుకుంది! నాలుగు రోజుల క్రితం పిల్లవాడిని హాస్పిటల్‌లో చూపించాలని ఊరి నుండి వచ్చిన పిన్నత్తగారి కొడుకూ, కోడలూ, వాళ్ళిద్దరి పిల్లలూ ఆ రోజు ఉదయమే తిరిగి వెళ్ళారు. పండుగనాడుకానీ, బంధువులు వచ్చినప్పుడు కానీ కొంచెం పని ఎక్కువ చేస్తే, ఆ మర్నాడు తన హక్కు అన్నట్లుగా పనిమనిషి చెప్పాపెట్టకుండా శెలవు తీసేసుకుంటుంది. ఆ రోజూ రివాజు ప్రకారం నౌకరు రాణి రాకపోయే సరికి పనులన్నీ పూర్తి చేసుకుని కొంచెం సేపు పడుకుందామని అనుకునే సరికి శివరామయ్య వచ్చాడు! ఇక చేసేదేముందీ, నిట్టూరుస్తూ పనిలోబడింది విశాల.

రెండు కూరలూ, అన్నం చేసి, అప్పడాలు, వడియాలు వేయించి మిగిలిన పప్పు, పులుసుతో భోజనం వడ్డించింది. అన్నీ మారు వేయించుకుని తింటోంటే విశాలకి తృప్తిగా అనిపించింది. ఆయన నిద్రపోయి లేచేసరికి స్వీటు, హాటు సిద్ధం చేసింది. ఏదో ఒక రోజు ఉండి వెళ్ళేవాళ్ళకు ప్రొద్దుటివి ఏం పెడతామని రాత్రి భోజనంలోకి మళ్ళా రెండు కూరలూ, చారు చేసింది. మామూలుగా అయితే ప్రొద్దుటి కూరలు మిగిలితే ఇక సాయంకాలానికి కూరలు వండదు.

రాత్రి భోజనాల దగ్గర "ఎందుకమ్మా శ్రమపడి మళ్ళా ఇన్ని చేశావు?" అన్నాడాయన. "శ్రమపడి మీ కోసం ప్రత్యేకం చేసిందేం లేదు బాబాయ్‌గారూ, మాకూ అన్నీ ఉండాల్సిందే" అంది విశాల మర్యాదకి.

"మాదీ ఇదే పద్ధతమ్మా. మీ పిన్ని కూడా బద్ధకించకుండా ప్రతిపూటా వేడిగా వండుతుంది. నన్నడిగితే మంచి భోజనం తర్వాతే ఏదైనా అంటాను. పోయేటప్పుడు మనం కూడా ఏమీ పట్టుకుపోలేం కదా, ఉన్నన్నాళ్లూ శుభ్రంగా అనుభవించాలి!" అన్నాడు. భోజనం చేస్తున్నంత సేపూ వంటకాల రుచినీ, భార్యాభర్తలిద్దరి మంచితనాన్ని ప్రశంసించాడు. పిల్లలిద్దరూ ముత్యాల్లా ముచ్చటగా ఉన్నారని మెచ్చుకున్నాడు. చాలా మంది ఆడవాళ్లకు మల్లే విశాలకీ తన వంటనీ, పిల్లల్నీ మెచ్చుకుంటే బ్రహ్మానందంగా ఉంటుంది. కానీ ఆరోజు మురిపించిన ఆ మాటలే మూడోనాడూ కూడా వింటోంటే విశాలకి ఆనందం కలగటం కాదు కదా చాలా అసహనంగా చిరాకుగా అనిపించింది!

ఆయన ఏదో ఒకటి రెండు రోజులుండి వెళ్ళిపోతాడని విశాల అనుకుంది. కానీ మూడో రోజు కూడా ప్రయాణం మాట ఎత్తకపోయేసరికి మనసులోనే మథనపడింది. రెండు రోజులు పూటపూటా కూరలూ, స్వీటు, హాటుతో టిఫిన్లూ అమర్చింది. మూడో రోజు కూడా అన్నీ చేయాల్సి వచ్చేసరికి కష్టంగా అనిపించింది. అనవసరమైన గొప్పకిపోయి 'మాకు అన్నీ ఉండాలి' అని నోరుజారానే అని మనసులో విసుక్కుంది.

నాలుగోరోజు ఉదయం ప్రకాశం ఆఫీసుకి వెళ్తోంటే శివరామయ్య అన్నాడు "డబ్బు ఇవ్వాల్సిన ఆ పెద్దమనిషి రేపుమాపు అంటూ వాయిదాలు వేస్తున్నాడు. వెళ్ళి మళ్ళా రావాలంటే బోలెడు ప్రయాణపు ఖర్చుల మాట అటుంచి పెద్దవాణ్ణి తిరగలేనుకదా! ఏదైనా హోటల్లో దిగితే బాగుండేది. మీకిబ్బంది కలిగిస్తున్నాను."

ప్రకాశం మర్యాదకి "మాకు ఇబ్బంది ఏం లేదు. ఏదో మాతోపాటే మీరూనూ" అన్నాడు విశాల వేపుచూస్తూ. గుండెల్లో రాయిపడినట్లున్నా చేసేదేంలేక "మీరు ఒక్కరూ మాకు బరువా ఏంటి! మాకేం ఇబ్బంది లేదు బాబాయ్‌గారూ!" అంది విశాల. శివరామయ్య ఆనందంగా నవ్వేశాడు.

"నాకు తెలుసమ్మా మీరలా అంటారని, కానీ నాకే మొహమాటంగా అనిపించింది. బయలుదేరే ముందే ఏదైనా హోటల్లో దిగుతానని అంటే మీ పిన్ని కోప్పడింది, అంత అభిమానంగా రమ్మని పిలిచిన వాళ్ళింటికి వెళ్ళకుండా హోటల్లో దిగితే అమ్మాయి వాళ్ళకి తెలిస్తే ఎంత బాధపడతారూ అని! ఏనాటి రుణానుబంధమో స్వంత కూతురిలా కలిసిపోయావు! నీమాట ఎందుకు కాదనాలీ, ఇక పని చూసుకునే వెళ్తానుమరి!"

ఇక ఆ తర్వాత ప్రయాణం మాటే మరిచిపోయినట్లుగా ఆయన నిశ్చింతగా రోజులు గడిపేస్తోంటే విశాలకి దిగులెక్కువైపోతోంది. పదిహేను రోజులపైగా వచ్చే నెయ్యి, సరకులు అన్నీ వారానికే అయిపోయాయి! మామూలుగా ప్రొద్దుటి కూరలు మిగిలితే రాత్రికి వాటితోనే సరిపెట్టేస్తుంది. కానీ శివరామయ్య వచ్చాక ప్రతిపూటా చేయాల్సివస్తోంది. కూరగాయలు, పాలు అన్నీ ఎక్కువ కొనాల్సిరావటంతో పెరిగిపోతున్న అప్పు భూతంలా కనపడుతూ భయపెడుతోంది! ఆపైన పని కూడా ఎక్కువైంది. ఆయనకు రోజుకి నాలుగైదు సార్లు కాఫీ కావాలి. ఎంతపని హడావుడిలో వున్నా "కొంచెం కాఫీ ఇవ్వమ్మా" అని ఆయన కేకపెట్టగానే కాఫీ పెట్టి ఇవ్వాల్సివస్తోంది. మనసులో విసుక్కున్నా చేయక తప్పదు మరి! బాకీ ఇవ్వాల్సిన పరంధామయ్య దగ్గరకు కాసేపు వెళ్ళి వచ్చేశాక రోజంతా ఖాళీగా కూర్చోవటమే ఆయన పని. తీరుబడిగా కూర్చుని "ఆ కూర చెయ్యమ్మా, ఇది చెయ్యమ్మా" అని పురమాయింపు లొకటీ!

అక్కడికీ ఒకసారి విశాల అంది "పిన్నిగారొక్కరూ ఉండాలి కదా, ఏంతోస్తుందీ, మీ కోసం ఎదురు చూస్తూంటారేమో" అని. అదేదో జోకయినట్లుగా ఆయన పెద్దగా నవ్వేశాడు! "మీ పిన్నికి కాలక్షేపం కాకపోవటం అంటూ ఉండదమ్మా. ఆవిడకసలు రోజుకి ఇరవైనాలుగ్గంటలు కాదు, నలభై ఎనిమిది గంటలయినా సరిపోవు! వీధివీధంతా స్నేహితులే మరి! ప్రొద్దున్న నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని బయట పడిందంటే, ఇక చీకటి పడ్డాకే కొంపకి చేరటం!"

"ఆ నాలుగు మెతుకులూ మాత్రం ఎవరింట్లోనోట్లో వేసుకున్నా గడిచిపోదు గనుక! అబ్బ! ఏం ముచ్చటైన జంట! ఇద్దరూ ఒక్కలాంటి వాళ్ళేనన్నమాట! మేడ్‌ఫర్ ఈచ్ అదర్ అంటారు ఇలాంటి వాళ్లనేకాబోలు!" మనసులో మెటికలు విరిచింది విశాల అక్కసుగా! ఆ రోజు పనిమనిషి రాలేదు. మంచి వచ్చినా, చెడ్డ వచ్చినా ఏదో కారణం చెప్పి నెలకి నాలుగైదు రోజులన్నా మానేస్తుంది. దానికున్న స్వాతంత్ర్యం తనకెక్కడిదీ, చస్తోన్నాసరే చాకిరీ చేయకతప్పదు! మనసులోనే రుసరుసలాడుతూ విసురుగా రోట్లోని కంద దంచుతోంది విశాల. అంతకు రెండు రోజుల క్రితమే విశాల గుమ్మంలో కూరలు కొంటోంటే, శివరామయ్య వచ్చి "కంద తీసుకోమ్మా వడలు చేద్దువుగానీ" అన్నాడు. విశాల చేతకాదని చెప్పింది. "అదెంతపని, నే చెబుతాగా!" అన్నాడాయన. ఇక తప్పక తీసుకుంది.

వంట గదిలో చేరి దగ్గరుండి ఎలా చేయాలో డైరెక్టుచేసి చేయించాడు. బావున్నాయని అందరూ బాగానే తిన్నారు, అది వేరే సంగతి. కానీ మళ్ళా రెండు రోజులకే కూరలు కొంటోంటే, కంద తీసుకోమని చెప్పేసరికి విశాలకి ఒళ్ళుమండింది. "వడిలిపోయినట్లుంది బాగాలేదు" అని వంకపెట్టి తీసుకోలేదు. ఆ రోజు సాయంకాలం ప్రకాశం ఆఫీసు నుండి వస్తూ అరకేజీ కంద తెచ్చేసరికి విశాల ఆశ్చర్యపోయింది!

"నువ్వు కొనాలని అనుకుంటే మంచిది దొరకలేదటగా అందుకని మార్కెటు నుండి తెమ్మని ఆఫీసుకి వెళ్ళేటప్పుడు బాబాయ్‌గారు చెప్పారు" అన్నాడు ప్రకాశం. ఆ కంద ముక్కని గోడవతలకి అలాగే విసిరిపారెయ్యాలన్నంత కోపం వచ్చింది విశాలకి. కానీ తమాయించుకుంది డబ్బులు పోసి కొన్నది కదా మరి! ఇక అందుకే ఆ రోజు వడలు చేయటానికని రోట్లో వేసి దంచుతూంది.

"అమ్మా, తాతగారు వెళ్ళిపోయారా?" అంటూ వచ్చాడు పదకొండేళ్ళ పెద్దకొడుకు రవి. "ఆయన అప్పుడే ఎందుకు వెళ్తారూ, రోగంతో నేను మంచమెక్కాలీ, అప్పులతో మీ నాన్న రోడ్డున పడాలీ!" మనసులోనే కోపంగా అనుకున్న విశాలపైకి "అలా బయటకెళ్ళారులే. ఏం?" అంది.

"ఉత్తరం వచ్చింది. తాతగారింటిపేరు 'జి' అంటే ఏంటమ్మా?" అన్నాడు. "ఏముందీ జిడ్డు అయివుంటుంది!" మెల్లగా గొణుక్కుని "ఏదో ఒకటిలే అక్కడ పెట్టు" అంది. రెండో కొడుకు రాజు చేతిలోని గాలిపటం చూసి "అదెక్కడిదిరా?" అనడిగింది. "నిన్న నాన్న ఇచ్చిన డబ్బులతో కొన్నాను. పావలా తక్కువైతే గోవిందు ఇచ్చాడు" అన్నాడు రాజు.

"ఇదుగో అలాంటి రుణాలేం వుంచుకోకు వెంటనే ఆ పావలా ఇచ్చెయ్యి. లేకపోతే ఈ పావలా అప్పే వచ్చే జన్మకి బోలెడంత పెరిగిపోతుంది! అప్పుడు నీ ఇంటికి చుట్టమైవచ్చి రోజుల తరబడి తిష్టవేసి వసూలు చేస్తాడు, తెలిసిందా?" అంది విశాల శివరామయ్య పట్ల పెరిగిపోయిన విసుగును మాటల్లో వెళ్ళగ్రక్కుతూ! రవి నవ్వుతూ అన్నాడు "అయితే అమ్మా, క్రితం జన్మలో నువ్వు చాలా మందికి బాకీ వున్నావన్నమాట! మరి మన ఇంటికి చుట్టాలెక్కువగా వస్తూంటారుగా!" విశాలకీ నవ్వొచ్చింది! నిజమేనేమో! అందుకే శివరామయ్య మాటమాటికీ ఏ జన్మరుణానుబంధమో అంటూంటాడు! అసలు ఈ ఊరికి ఎవరో ఆ పరంధామయ్య బాకీ గురించి రాలేదు, గత జన్మలోని తన రుణాన్ని వసూలు చేయటం కోసమే తమ ఇంటికి వచ్చినట్లున్నాడు! అదెప్పటికి తీరుతుందో! మనసులోనే నిట్టూర్చింది విశాల.

ఆ సాయంకాలం శివరామయ్య ఫస్టు షో సినిమాకి వెళ్ళాడు. భర్తకూ, పిల్లలకూ పెట్టి అన్నీ సరిపోతాయో లేదోనని ఆయన వచ్చే వరకూ భోజనం చేయకుండా కూర్చుంది విశాల. ఆ వారంలో అది మూడోసారి శివరామయ్య సినిమాకు వెళ్ళటం. ఇంత తిని తొందరగా పడుకోవటానికి వీల్లేకుండా ఆయన కోసం కనిపెట్టుకుని కూర్చోవాల్సి రావటంతో విశాలకి తగని ఉక్రోషంగా ఉంది.

ఆ కోపం ప్రకాశం మీదకు తిరిగింది. "అసలు మిమ్మల్ని అనాలి. ఆయన వెళ్తానని అన్నప్పుడు వూరుకోకూడదూ! మెహర్బానీకి పోయి మాకేం ఇబ్బందిలేదు అంటూ అడ్డంపడి ఆపుచేశారు. మీదేం పోయిందీ, చాకిరీ చేసేది నేనేగా! కిరాణా కొట్లో అప్పుకూడా కొండలా పెరుగుతోంది! అయినా ఆ పెద్దమనిషయినా ఇవతలివాళ్ళ స్థితిగతులేమిటా అని అర్థం చేసుకోవద్దూ! తనకి ప్రయాణం ఖర్చులవుతాయని మనకి మధ్యలో ఆమదం! కూడా పట్టుకుపోతామా, శుభ్రంగా ఖర్చు చేసుకోవాలిగానీ అని అంటాడు. అందరికీ అలా చెప్పటం, తనకి మాత్రమే పట్టుకుపోవటానికి లైసెన్సు ఉన్నట్లుగా పర్సులోంచి పైసా తియ్యడు! పిల్లలు కూడా లేరు. ఏం చేసుకుంటాడో! మొన్నటికి మొన్న పిల్లలు ఐస్‌క్రీం అని గొడవ చేస్తోంటే లోపల నుండి నేను వచ్చి డబ్బులు ఇచ్చేవరకూ చూస్తూ నిలబడి వున్నాడే తప్ప ఆ మాత్రం ఖర్చుకి కూడా ప్రాణం ఒప్పలేదు! పైగా పిల్లలు "తాతయ్యా తింటావా?" అంటూ తెచ్చి ఇస్తే అందుకుని ఆప్యాయంగా తిన్నాడు!"

విశాల వాగ్ధాటికి ప్రకాశం అడ్డుపడ్డాడు "వచ్చేవేళయింది వింటే బావుండదు ఇంతా చేసి మాటపోగొట్టుకోవటం ఎందుకూ? మాట వరసకి ఏదో ఉండమని అన్నానేకానీ నాకు మాత్రం ఏం తెలుసూ, ఇన్నాళ్లుంటారని! ఆ మాట నేనే ఏమిటి; నువ్వూ అన్నావుగా, ఇబ్బందేం లేదూ, ఉండమని"

"బావుంది. మీరన్నాక నేను అనక చస్తానా!" అంది విశాల.

"సరేలే ఏంచేస్తాం నాలుగు రోజులు ఓపికపట్టు. రెండు రోజుల్లో నాకు లోను ఆరేడు వందలు అందుతుంది. కిరాణాషాపులోని అప్పు సగమైనా తీర్చేయవచ్చు. రెండు మూడు నెలలు కొంచెం

జాగ్రత్తగా ఉండి కొంచెం కొంచెంగా మిగతాదీ తీర్చేద్దాంలే" అనునయంగా అన్నాడు. "అంతకు మించి మాత్రం చేసేదేం వుందిలే. ఎన్నాళ్ళో మరి భరించక తప్పదు" అనుకుంటూ నిట్టూర్చింది విశాల.

రెండు రోజుల తర్వాత విశాల చెల్లెలు భర్త రామ్మూర్తి వచ్చాడు. పిల్లలిద్దర్నీ తనతో తీసుకెళ్ళి మళ్ళా వారం తర్వాత పంపిస్తానని అంటే, సెలవులే కదాని పంపించింది. ప్రకాశానికి ఆ సాయంకాలమే అనుకోకుండా క్యాంప్‌కి వెళ్ళేపనిబడింది. బస్‌స్టాండు వరకూ కూడా వెళ్ళి వచ్చాడు శివరామయ్య.

ఆ మర్నాడు విశాలకి కొంచెం తలనొప్పిగా అనిపించింది. మామూలుగా అయితే అలాంటి చిన్నచిన్న నలతలను లెక్కచేయదు కానీ ఎలాగూ పిల్లలూ, భర్తాలేరు శివరామయ్యను హోటల్‌కు భోజనానికి పంపిస్తేసరి అనుకుంది.

అందుకే "బాబాయ్‌గారూ, చాలా తలనొప్పిగా, ఒళ్ళంతా నొప్పులుగా ఉంది. జ్వరం వచ్చేట్లుగా అనిపిస్తోంది. నేనెలాగూ భోజనం చేయలేను, మీరు బయట హోటల్లో తినివస్తారా?" అంది నసుగుతూ. భోజనం చేయకపోయినా ఫర్వాలేదు, విశ్రాంతిగా పడుకుంటే సరి అనుకుంది.

"తలనొప్పికి భోజనం మానేయటమేమిటమ్మా విశ్రాంతిగా పడుకుంటే అదే తగ్గిపోతుంది. వంట అదేం వద్దు. నేను ఇద్దరికీ హోటల్‌నుండి పట్టుకువస్తాను."

"నాకేం వద్దు బాబాయ్‌గారూ, మీరు చేసి రండి" అని విశాల అంటున్నా వినిపించుకోకుండా కారియర్ పట్టుకెళ్ళాడు. ఆ మర్నాడు విశాల వంట చేస్తానన్నా ఆయన వినిపించుకోలేదు.

"నీకసలు విశ్రాంతి లేకపోవటమేగానీ మరేం అనారోగ్యం లేదమ్మా. నేను చూస్తునే ఉన్నాకదా, రోజంతా ఏదోపని చేస్తూనే ఉంటావు. అబ్బాయి, పిల్లలూ ఎలాగూలేరు. ఈ నాలుగు రోజులూ వంటపని పెట్టుకోకుండా రెస్టు తీసుకో నాపనీ అయిపోయింది. ఈవేళ వెళ్ళిపోదామని అనుకున్నా. కానీ అబ్బాయి లేనప్పుడు, నీకు ఒంట్లో బాగాలేనప్పుడు ఇన్నాళ్ళూ ఉండి ఇప్పుడు వెళ్ళిపోవటమేమిటని ఆగిపోయాను. ఇద్దరికేగదా, ఈ నాలుగు రోజులూ నేను కారియర్ పట్టుకొస్తాను. ఇక నువ్వేం అడ్డుచెప్పకు" అన్నాడాయన.

రోజంతా కాళీగా కూర్చుని ఆయన హోటల్ నుండి తెచ్చినవి తినాలంటే విశాలకి చాలా మొహమాటంగా అనిపించింది. అందుకే మూడోనాడు వంట చేస్తానని మొదలుపెట్టబోతే ఆయన కసురుకున్నాడు. "ఏమిటమ్మా నీ చాదస్తం. నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోమంటే వినవేంటీ!" అని.

"రోజూ హోటల్ నుండి అంటే మాటలా బాబాయ్‌గారూ, చాలా ఖర్చవుతుంది కదా" అంటూ మెల్లగా నసిగింది విశాల.

"అయితే మాత్రమేమిటమ్మా! డబ్బు ఖర్చవుతే అవుతుంది, మన సుఖం కంటేనా! అనారోగ్యం ఏం లేకపోయినాగానీ ఎంత నీరసరంగా ఉన్నావో చూడు! ఈ నాలుగు రోజులూ ఏపనీ పెట్టుకోకుండా విశ్రాంతిగా ఉంటే మళ్ళా మామూలవుతావు. ఇక అప్పుడు నీపని నీకెలాగూ తప్పదు. అందుకని అబ్బాయి వచ్చేవరకూ వంటమాట ఎత్తకు. డబ్బుగొడవ నీకెందుకమ్మా?" అన్నాడు శివరామయ్య.

విశాల కళ్ళు చెమర్చాయి! తన భర్త అయినా ఎప్పుడూ అనలేదు వంట చేయొద్దు హోటల్ నుండి తెస్తానని. తనకి ఎప్పుడైనా ఒంట్లో బాగాలేదంటే తనే చేస్తానని వంటగదిలోకి వస్తాడు గానీ హోటల్ నుండి తెస్తానని అనడు. ఎప్పుడో ఒకసారి హోటల్‌కి వెళ్ళితే అరవై రూపాయల బిల్లయింది! గుండె గుభేలు మంది తనకి! వారం పదిరోజుల కూరగాయల ఖర్చు వెళ్ళమారిపోయేది, అనవసరంగా

ఒక్కపూట భోజనానికి అంతయిందని మథనపడిందప్పుడు. అందుకే ఆ తర్వాత తనూ ఎప్పుడూ హోటల్‌కి వెళ్దామని అనలేదు.

విశాల మనసులో పశ్చాత్తాపం పెరిగిపోయింది. ఛ! ఛ! ఇలాంటి పెద్దమనిషినేనా తను పిసినారనీ, జిడ్డు అనీ విసుక్కుంది! తండ్రిలా 'అమ్మాయీ' అన ఆప్యాయంగా పిలుస్తూ నాలుగు రోజులుండి పోవటానికనివస్తే ఎప్పుడు వెళ్ళిపోతాడా అని ఎదురు చూసింది. ఏదో జిహ్వా చాపల్యం కొద్దీ పెద్దాయన నోరు తెరిచి ఏదైనా చేసి పెట్టమని అడిగితే మనసులోనే తెగ రుసురుసలాడింది! ఏదో పని పూర్తవ్వక ఉండాల్సి వచ్చి వున్నారుకానీ లేకపోతే ఎందుకు ఉంటారూ ఎవరైనా! ఆమాత్రం ఆలోచించకుండా తెగ విసుక్కుంది. తనుమాత్రం ఏం చేస్తుందీ, పరిస్థితులలా వచ్చాయ్! వరసగా చుట్టాల మీద చుట్టాలు రావటం, అప్పు పెరగటం, పనితో నీరసం ఎక్కువవటం... అలా మనసులో చికాకు పడిందిగానీ లేకపోతే తనకి మాత్రం బంధువులు, స్నేహితులు రావటం అంటే ఇష్టమేకదా! అనుకుంది మనసులో విశాల.

శివరామయ్య రోజుకో హోటల్ నుండి రోజుకో రకమైన భోజనం తీసుకువస్తున్నాడు. దూరమైన హోటల్‌కి ఆటోలోనూ, రిక్షాలోనూ వెళ్ళి మరీ తీసుకువస్తున్నాడు. బిర్యానీలు, ఫ్రైడ్ రైసు ఇలా అన్ని రకాలూ రుచి చూసింది విశాల.

ఏదో పదిహేను రోజులు తమ ఇంట్లో ఉండి బాకీ వసూలు చేసుకున్నందుకు ఆయన అభిమానంగా ఖర్చు పెడుతున్నాడు. అయినా సరే ఇంటికొచ్చిన బంధువుతో ఖర్చు పెట్టించటం ఏం మర్యాదగా ఉంటుందీ! చెప్పినా వినటంలేదు కాబట్టి ఈసారి వచ్చేటప్పుడు పిన్నిగారిని తీసుకురమ్మని చెప్పాలి. అప్పులు తీరి కొంత ఒడ్డున పడితే అప్పుడు అవిడకు ఒక చీర పెడితే సరిపోతుందని అనుకుంది.

ఆ రోజు సూట్‌కేసు సర్దుకుంటూ శివరామయ్య విశాలతో అన్నాడు "ప్రకాశం సాయంకాలం వచ్చేస్తాడుగా, నే వెళ్తానమ్మా. ఇంకో గంటలో బండి ఉంది."

"అలాగే బాబాయ్‌గారూ. ఈ సారి వీలుచేసుకుని పిన్నిగారిని కూడా తీసుకునివచ్చి నాలుగు రోజులుండాలి." అంది విశాల అభిమానంగా. దారినపోతోన్న రిక్షాని పిలిచి అందులో సూట్‌కేసుపెట్టి ఎక్కబోతూ ఆగి వెనక్కివచ్చి గుమ్మందగ్గర నిలబడిన విశాలతో అన్నాడు.

"అమ్మాయ్ చెప్పటం మరిచాను. అబ్బాయి వెళ్ళేరోజు బస్‌స్టాండులో ఏదోలోను పెట్టి తీసుకున్న డబ్బు నీకిద్దామని మర్చిపోయాడుట. ఇవ్వమని నాకిచ్చాడు. ఏదైనా బయట నుండి తేవాల్సింది నేనేకదాని ఆ అయిదు వందలూ నాదగ్గరుంచాను. ఖర్చు అంతా రిక్షా ఖర్చులతో సహా అన్నీ రాశాను. ఆ కాగితం, మిగిలిన మూడు రూపాయల ముప్పావలా అలమారాలో అద్దం దగ్గిర పెట్టాను, చూడమ్మా. వస్తాను" శివరామయ్య రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడు.

షాక్ తగిలిన దానిలా బిగుసుకుపోయింది విశాల! ఈ వారం రోజుల వైభోగమంతా తమ డబ్బుతోనేనా?! అప్పు కొంతయినా తీరుతుందనుకున్న ఆ డబ్బంతా హుష్‌కాకీ అయిపోయిందా!! 'అయ్యో! భగవంతుడా!' అంటూ తలపట్టుకుని గుమ్మంలోనే కూలబడిపోయింది.

'పిలిచావా తల్లీ, ఇదిగో వస్తున్నాం' అన్నట్లుగా అప్పుడే ఇంటిముందు ఆగిన రిక్షాలో నుండి దిగుతున్న ఇద్దరు అతిథి దేవుళ్ళను చూడగానే విశాల నిలువు గుడ్లేసుకుని మరింత బిగుసుకుపోయింది!

ఈనాడు ఆదివారం. 18, ఏప్రిల్ 1993.